క్లుప్తంగా

వలస కార్మికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి పీఎస్ ప్రసాద్

పెదపాడు: గ్రామానికి దూరంగా ఉన్న వలస కార్మికుల పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని ఏలూరు జిల్లా మలేరియా అధికారి పీఎస్ ప్రసాద్ సూచించారు. మండలంలోని కొత్తముప్పర్రులో ఉన్న ఇటుక బట్టీలను ఆయన సందర్శించి అక్కడ వలస కార్మికులకు సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి పదిరోజులకు ఒకసారి ఇటుక బట్టీలు, కోళ్ల పారాలు, ఊరికి దూరంగా ఉన్న ఆయిల్‌పామ్ తోటలో ఉండే వారికి వ్యాధులపై అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఇటుక కార్మికులకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై మలేరియా జ్వరాల పట్ల ఇతర అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వంతెన పనుల్లో పిల్లర్లపై గడ్డర్ల బిగింపు

భీమడోలు: గుండుగొలను వద్ద గోదావరి కాలువపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు ముఖ్య ఘట్టానికి చేరుకున్నాయి. వంతెన పనుల్లో భాగంగా శుక్రవారం పిల్లర్లపై గడ్డర్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన ఇంజనీర్ల బృందం పర్యవేక్షణలో పిల్లర్లపై గడ్డర్లను బిగిస్తున్నారు. మూడు గడ్డర్లలో ఒక గడ్డర్‌ను భారీ యంత్రం సాయంతో శుక్రవారం బిగించారు. మరో రెండు గడ్డర్లను బిగించిన తరువాత వాటిపై శ్లాబ్ వేయడంతో పనులు పూర్తవుతాయని సంబంధిత అధికారులు అంటున్నారు.

కైకరం షష్ఠి తిరునాళ్లకు పోటెత్తిన జనం



కైకరం షష్ఠికి తిరునాళ్లలో పాల్గొన్న భక్తులు

ఉంగుటూరు: కైకరం షష్ఠికి తిరునాళ్ల ముగింపు రోజైన శుక్రవారం జనం పోటెత్తారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రతిరోజు రాత్రి వేళ సాంస్కృతిక కార్యక్రమాలు కమిటీ తరపున నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

దత్తక్షేత్రంలో కృత్తికా దీపోత్సవం

ఉంగుటూరు : స్థానిక దత్త బాలసుబ్రహమణ్య స్వామి క్షేత్రంలో సుబ్రహమణ్యస్వామికి శుక్రవారం ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామికి కృత్తికా నక్షత్ర దీప సమర్పణ నిర్వహించారు. క్షేత్రంలో ఉన్న ఆంజనేయస్వామికి అభిషేకం, నాగవల్లీ దళార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నిక

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా ఎన్.విజయకుమార్ (అధ్యక్షుడిగా)ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా కె.వి.గిరిధర్ (బాదంపూడి), ఉపాధ్యక్షుడిగా పి.ధనలక్ష్మి (గోపినాథపట్నం), కోశాధికారిగా బీవీ రవిచంద్రకుమార్(ఉంగుటూరు), ప్రధాన కార్యదర్శిగా జి.రమేష్ (యర్రమిల్లిపాడు) ఎన్నికయ్యారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నిక పూర్తయిన వెంటనే ఎంపీడీవో గంజిరాజీమనోజును వారు కలిశారు. పని ఒత్తిడి తగ్గించాలని కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు.

సౌరశక్తిని సద్వినియోగం చేసుకుందాం

పెదవేగి : కాలక్రమంగా తరిగిపోతున్న ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తిని వినియోగించుకుని భావితరాలకు మెరుగైన సహజ వనరులను, కాలుష్య రహిత సమాజాన్ని అందించడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.దుగ్గిరాలలో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే చింతమనేని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి .సాల్మన్ రాజు, డీఈ కే.ఎం.అంబేద్కర్, పెదవేగి ఏడీఈ కృష్ణరాజు, ఇన్‌చార్జి ఏఈ రాంబాబు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎమ్మార్వో భ్రమరాంబ పాల్గొన్నారు.

నెరవేరని సూపర్ సిక్స్ హామీలు

- చంద్రబాబు సర్కారుపై జనం ఆగ్రహం
- నిన్ను నమ్మం బాబూ అంటున్న మహిళలు, నిరుద్యోగులు

పెదవేగి : 20 లక్షల ఉపాధికి అవకాశాలు లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ 15,000, ప్రతి రైతుకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకి నెలకు రూ. 1,500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. ఇలా సూపర్ 6 పేరుతో హామీల వర్షం గుప్పించిన చంద్రబాబు అధికారం చేపట్టి ఆరు నెలలైనా ఒక్క హామీ నెరవేర్చలేకపోయారు. దీంతో సామాన్య జనం నుంచి అన్ని వార్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు చెప్పేదంతా మోసం, చేసేదంతా దగా, నిరుద్యోగ భృతి పెద్ద నాటకం, డ్వాక్రా యానిమేటర్లకు నోటీసుల టెన్షన్, యువతతకు ఉపాధి శూన్యం, అన్నదాత పరిస్థితి దైన్యం. ఇకపై నిన్ను నమ్మం బాబూ, మీ మాటలు పెద్ద బూటకం అంటూ ప్రజానీకం సీఎం చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా తాత్సారం చేస్తూ డైవర్షన్ రాజకీయాలకు తెరతీస్తున్న చంద్రబాబు పాలనా తీరుపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



భగ్గుమంటున్న నిత్యావసర వస్తువుల ధరలు



ఆరు నెలలుగా నిత్యావసర ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ధరల భారంతో చాలా కూరగాయలు తినడం మానేయాల్సి వస్తోంది. కరెంటు బిల్లు చూస్తే గుండె ఆగిపోతోంది. తక్కువ ఆదాయం ఉన్న వాళ్లు బతకడమే కష్టంగా మారింది. విలాసం, వినోదం మాట దేవుడెరుగు సౌకర్యవంతమైన జీవన విధానానికి ప్రభుత్వం సహకరించాలి.

– చోడిశెట్టి ప్రభావతి, లక్ష్మీపురం

ప్రజలను మోసం చేశారు



రాష్ట్ర ప్రజలను మోసం చేయటానికి చంద్రబాబు అధికారం కోసం అనేక కుట్రలకు పాల్పడి అధికారం చేపట్టారు. ఓటమి భయంతో ఈవీఎంల ట్యాంపరింగ్ చేసి అలవికాని హామీలిచ్చి నేడు ఒక్కటీ నెరవేర్చడం లేదు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా బాబును ఇక ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.

– తొత్తడి వేదకుమారి, దెందులూరు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఆచరణలో పేదలకు సంక్షేమ పథకాలు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. రైతులకు సార్వాకు అందించాల్సిన ప్రభుత్వ సాయం దాళ్వా సీజన్ వచ్చినా అందలేదు. చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు.

– కె శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

కానరాని అభివృద్ధి



అభివృద్ధి అంతా ఎల్లో మీడియాలోనే తప్ప బయట ఎక్కడా కానరావడం లేదు. రోజూ ఆ పథకానికి అన్ని కోట్లని, ఇన్ని కోట్లని చదువుతున్నాం. కానీ ఆచరణలో కన్పించడం లేదు. ముఖ్యంగా యువకులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే ఉన్న ఉద్యోగాల నుంచి తీసేస్తున్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ. 3 వేలు, ఉద్యోగాల భర్తీ ఊసేలేదు.

– సీహెచ్ వెంకటేశ్వరరావు, దిబ్బగూడెం

భూ సమస్యలపై రెండు వినతులు

దెందులూరు: భూ సంబంధిత సమస్యపై రైతులు రెవెన్యూ గ్రామ సభల్లో దరఖాస్తు అందజేయాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం ఉప్పుగూడెం, చల్లపల్లిలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో 50 సమస్యలకు సంబంధించి వినతిపత్రాలను రైతులు తహసీల్దార్‌కు అందజేశారు. మండల తహసీల్దార్ రమణారావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమ మాలిని, అధికారులు, రైతులు ఉన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

పెదవేగి : హిందూ దేవాలయ వ్యవస్థ ప్రక్షాళనే ప్రధాన లక్ష్యంగా నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగసభకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను విశ్వహిందూపరిషత్ నాయకులు కలిసి ఆహ్వానించారు. శుక్రవారం పెదవేగి మండలం దుగ్గిరాలలోని ఎమ్మెల్యే చింతమనేని క్యాంప్ కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్‌ను విశ్వహిందూ పరిషత్ రాష్ట్రకార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, హైందవ శంఖారావం జిల్లా కన్వీనర్ కస్తూరి సూర్యప్రకాష్, హైందవ శంఖారావం జిల్లా కో కన్వీనర్ మేడిశెట్టి పాములు, జిల్లా నిధి సేకరణ ప్రముఖ్ కట్నేని కృష్ణ ప్రసాద్ కలిసి హైందవ శంఖారావం సభ ప్రధాన ఉద్దేశాలను వివరించారు. హైందవ శంఖారావం కరపత్రాలను చింతమనేనికి అందించారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ జనవరి 5న గన్నవరంలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం సభలో తప్పనిసరిగా పాల్గొనడంతో పాటు సభ విజయవంతానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానన్నారు.

అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిన చంద్రబాబు

- దగా పడిన రైతన్నకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎం చంద్రబాబు
- మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



ఉంగుటూరు: మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో చేబ్రోలు నుంచి ఏలూరు వెళుతున్న పార్టీ శ్రేణులు



దెందులూరు: ఏలూరు వెళ్తున్న దెందులూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

నిడమర్రు: సీఎం చంద్రబాబు అధికారం చేపట్టి ఆరు నెలలైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతన్నలతోపాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు విమర్శించారు. దగా పడిన రైతన్నకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం సాగిస్తుందని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన రైతు పోరుబాటకు నిడమర్రు, గణపవరం మండలాలల నుంచి 200 మంది వైఎస్సార్‌సీపీ అభిమానులు, రైతులు బువ్వనపల్లి పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తానన్న రూ.20వేలు మంజూరయ్యే వరకూ రైతుల పక్షాన పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సిద్ధం ఉన్నాయన్నారు. అనంతరం రైతు పోరుబాట ర్యాలీ మందలపర్రు, నిడమర్రు మీదుగా ఉంగుటూరు మండల చేరుకుంది. ఈ కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు మండలాల పార్టీ కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ కోడే కాశి, జిల్లా వ్యవసాయ సలహా మండలి వైస్ చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ ధనుకొండ బుజ్జి, నిమ్మల బుజ్జి తదితరులున్నారు.

ఏలూరు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఉంగుటూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశానుసారం ఉంగుటూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులంతా రైతుల సమస్యలపై కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించేందుకు శుక్రవారం ఏలూరు తరలివెళ్లారు. ర్యాలీ నారాయణపురం, చేబ్రోలు సెంటర్ల వద్దకు వచ్చేసరికి ఉంగుటూరు మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజాప్రతినిధులు అక్కడికి చేరుకుని సంఘీభావం తెలిపారు. ర్యాలీకి వారు స్వాగతం పలికారు. అక్కడి నుంచి అందరూ కలిసి ఏలూరు తరలివెళ్లారు.

రైతు ధర్నాకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దెందులూరు: ఏలూరులో శక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు, నాయకులు ఏలూరు తరలివెళ్లారు. పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డినాని, ఏలూరు మండల పార్టీ అధ్యక్షుడు తేరా ఆనంద్, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, దెందులూరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, మండల వైస్ ఎంపీపీలు వేమూరు జితేంద్ర, నాగరాజు పార్టీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, గొల్లా వీరాస్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, పార్టీ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నాయకులు, కార్యకర్తలు రైతులు తరలివెళ్లారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

మారిన వాతావరణం.. రైతుల గుండెల్లో గుబులు



చక్రాయిగూడెంలో హడావుడిగా వరి పనల పడుగు వేస్తున్న రైతులు

పెదవేగి : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావం కోస్తా తీరప్రాంతంపై ఉంటుందన్న వాతావరణశాఖ హెచ్చరికలు రైతుల గుండెల్లో అలజడి రేపుతున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సమయంలో వాతావరణంలో మార్పులవల్ల వర్షాలు కురిస్తే పంటంతా నీళ్లపాలైపోతుందన్న భయం అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కొద్దిరోజుల క్రితమే వాతావరణంలో మార్పులతో రైతులు తీవ్ర ఒత్తిడికి గురైన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ అల్పపీడనం అంటే రైతులు ఏంచేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. తీరం వెంబడి గంటకు 70నుంచి 80కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, సముద్రపు అలలు ఆరు మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడవచ్చని వస్తున్న వార్తలు రైతుల్లో తీవ్ర భయాన్ని నింపుతున్నాయి. దీంతో చేసేది లేక ఇప్పటికే వరి కోతలు పూర్తి చేసిన రైతులు హడావుడిగా ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వ సన్నద్ధం



దెందులూరు: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బి.సుమతి

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు శనివారం (14వ తేదీ) నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల ఏర్పాట్లు చేశారు. మెట్ట ప్రాంతంలో 8 మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఆయా గ్రామాల పాఠశాలల వద్ద పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. డెల్టాలో మేజర్ ఇరిగేషన్ సాగునీటి సంఘాలకు ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. మేజర్ నీటి సంఘాల ఎన్నికల్లో 15,153 మంది ఓటర్లుగా ఉన్నారు. మైనర్ ఇరిగేషన్ చెరువులకు 1,147 మంది ఓటర్లుగా ఉన్నారు. మేజరు సాగునీటి సంఘాల నిర్వహణకు ఒక్కో పోలింగ్ బూత్‌కు ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారిని నియమించారు. మైనర్ ఇరిగేషన్ చెరువులు ఎన్నికకు ఒక ఎన్నికల అధికారిని నియమించారు.

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దారు పూర్ణచంద్ర ప్రసాదు తెలిపారు. ప్రతి టీసీకి ఒక పోలింగు ఆఫీసరు, ఒక అసిస్టెంటు పోలింగ్ ఆఫీసరును నియమించినట్లు తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు వెల్లడించారు. 22 మంది ఎన్నికల ఆఫీసర్లను, ఏడుగురిని సహాయ ఎన్నికల ఆఫీసర్లను నియమించామని తెలిపారు. పోలింగు అధికార్లను 136 మందిని, ఏపీవోలను 136 మందిని నియమించినట్లు తహసీల్దారు వివరించారు.

71 నీటి సంఘాలకు నేడు ఎన్నిక

దెందులూరు: సాగునీటి సంఘాల ఎన్నికలో భాగంగా శనివారం 71 సాగునీటి సంఘాలకు ఎన్నిక నిర్వహించనున్నట్టు మండల ఎన్నికల అధికారి, దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అన్ని గ్రామాల వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం ఎన్నిక 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు.



ఉంగుటూరు: బొమ్మిడి సాగునీటి సంఘం ఎన్నికలకు పోలింగ్ కేంద్రం సిద్ధం

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

భీమడోలు: సాగు నీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసామని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి శుక్రవారం తెలిపారు.మండలంలో 6 మేజర్, 5 మైనర్ సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద రైతుల జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, అంబర్‌పేట, ఆగడాలలంక, చెట్టున్నపాడు మేజర్ సాగునీటి సంఘాలు కాగా పోలసానిపల్లి, అంబర్‌పేట, దుద్దేపూడిలోని చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

నేడు నీటి సంఘం ఎన్నికలు

పెదపాడు: నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు పెదపాడు తహసీల్దార్ ఏ కృష్ణజ్యోతి శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఎన్నికలు ప్రారంభమవుతాయని చెప్పారు.

గ్యాస్ట్రిక్ సమస్యలపై నిర్లక్ష్యం తగదు



గణపవరంలో ఆరోగ్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణవర్ధన్

గణపవరం: గ్యాస్ట్రిక్ సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని, సమస్య తీవ్రరూపం దాల్చకుండా వైద్యనిపుణుల సలహాలు తీసుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు కృష్ణవర్ధన్ అన్నారు. శుక్రవారం గణపవరం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో గ్యాస్ సంబంధిత సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మారుతున్న ఆహార అలవాట్లు, సమయపాలన పాటించకుండా ఎప్పుడు పడితే అప్పుడు తినడం, ఫాస్ట్ ఫుడ్స్ తదితర కారణాల వల్ల ప్రతి ఒక్కరూ గ్యాస్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు.గ్యాస్ట్రిక్ సమస్యలు నిర్లక్ష్యం చేస్తే సర్జరీ వరకూ వెళ్లే ప్రమాదం ఉంటుందన్నారు. ఈసందర్భంగా గ్యాస్ట్రిక్ సమస్య నివారణకు పాటించాల్సిన నియమాలను వివరించారు. ఈకార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నిడమర్తి జయసూర్య, జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావ సభకు తరలిరావాలి

ఉంగుటూరు: హిందూ ఆలయాల ప్రక్షాళనే లక్ష్యంగా జనవరి 5న గన్నవరంలో విశ్వహిందూ పరిషత్ నిర్వహిస్తున్న హైందవ శంఖారావ సభకు తరలిరావాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే ధర్మరాజుకు విశ్వహిందూ పరిషత్ నాయకులు కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మారాజు మాట్లాడుతూ హిందువులు అందరూ ఈసభకు తరలి రావాలని కోరారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, హైందవ శంఖారావం జిల్లా కన్వీనర్ కస్తూరి సూర్యప్రకాష్, కో కన్వీనర్ మేడిశెట్టి సోములు, ప్రముఖ్ కట్నేని కృష్ణ ప్రసాదు, శరణాల మాలతీరాణి, శోభారాణి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలు ఆర్థిక సుస్థిరత సాధించాలి



భీమడోలులో సుస్థిరాభివృద్ధిపై శిక్షణనిస్తున్న పీఆర్ ఏఈ సూర్యచంద్రరావు, చిత్రంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి



గణపవరంలో శిక్షణ పూర్తిచేసుకున్న సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీడీవో శ్రీలక్ష్మి

భీమడోలు: గ్రామ పంచాయతీలు ఆర్థిక సుస్థిరత సాధించేందుకు, గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు సర్పంచులు, ఉద్యోగులు తమ వంతు కృషి చేయాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల పాటు కొనసాగిన సర్పంచులు, గ్రామకార్యదర్శుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి కోర్సు అసిస్టెంట్ డైరెక్టర్, ఈవోఆర్డీ సుందరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడుతూ సంపద సృష్టిపై ప్రత్యేక దృష్టిని సారించాలని, పారిశుద్ధ్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, పీఆర్ ఏఈ సూర్యచంద్రరావు, ఎంపీహెచ్‌ఈవో కిషోర్ సుస్థిరాభివృద్ధికి సూచించిన అంశాలపై శిక్షణ అందించారు. గుండుగొలను, ఆగడాలలంక, చెట్టున్నపాడు, లక్ష్మీపురం, కోరుకల్లు, సూరప్పగూడెం, అంబర్‌పేట, కురెళ్లగూడెం సచివాలయాల్లోని గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

గణపవరం: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలని గణపవరం ఎంపీడీవో బీబీశ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులపాటు మండలంలోని సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న సభ్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పంచాయతీల అభివృద్ధిపై అవగాహన సదస్సు

దెందులూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించినట్టు దెందులూరు ఎంపీడీఓ కే.శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నైపుణ్యం లేని కార్మికుల వలసలను అడ్డుకోవడానికి ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలి

ఉంగుటూరు: గ్రామ పంచాయతీలకు ఆధాయ వనరులు పెరుగుదలపై దృష్టి సారించి పనిచేయాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. శుక్రవారం రెండో రోజు సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అధికారులకు, సర్పంచ్‌లకు పలు అంశాలు వివరించారు. రిసోర్సు పర్సన్ శ్రీనివాసరావు జాతీయ నీటి వనరులు పథకాలపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.